క్లుప్తంగా

రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలి



రాష్ట్ర స్థాయికి ఎంపికైన బాలురు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో ఆదివారం ఉమ్మడి జిల్లా జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు 150మంది పాల్గొన్నారని, ఉత్తమ ప్రతిభ కనబర్చిన 20బాలురు, 20మంది బాలికలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన బాలురకు జిల్లా కేంద్రంలో ఐదు రోజుల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ అనంతరం ఈ నెల 14నుంచి 16వరకు హనుమకొండలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ కోచ్ అరవింద్, విశాల్, పీడీ, పీఈటీలు రమేశ్, రాకేశ్, చిన్నక్క, రవి, తిరుమల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడికి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న నారాయణ మూర్తి

ఆసిఫాబాద్‌రూరల్: పద్య సరస్వతీ పీఠం తెలంగాణ సాహిత్య సేవ ట్రస్టు ఆధ్వర్యంలో ఏటా అందించే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర ఉన్నత పాఠశాల తెలుగు టీచర్ మాడుగూరి నారాయణ మూర్తి ఎంపికయ్యారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఉత్తమ తెలుగు భాష పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో ఈనాడు ప్రధాన సంపాదకులు ప్రసాద్, విశ్వ విద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు వెంకటరెడ్డి, గురుకులం నిర్వాహకులు రాఘవేంద్ర అష్టావధాని కవులు భాను ప్రకాష్ చేతుల మీదుగా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రజావాణి వాయిదా

ఆసిఫాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అర్జీలను స్వీకరించేందుకు ప్రతి మంగళవారం, శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 10నుంచి 11వ తేదీకి వాయిదా వేసినట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థికి అండగా అభిమన్యు వాట్సాప్ గ్రూప్

నార్నూర్: జైనూర్ మండలంలోని పుల్లారా గ్రామానికి చెందిన మార్సుకోలా కృష్ణ ఐఐఐటీ రాయచురులో సీటు సాధించాడు. పేద కుటుంబం కావడంతో ఆర్థిక పరిస్థితి అంతంతా మాత్రంగానే ఉంది. ఈ విషయం గాదిగూడ మండలం లోకారి(బి) గ్రామానికి చెందిన మెస్రం శేఖర్ దృష్టికి వచ్చింది. అతను అభిమన్యు వాట్సాప్ గ్రూపులో విద్యార్థి ఆర్థిక పరిస్థితిపై పోస్ట్ పెట్టడం జరిగింది. స్పందించిన దాతలు నిరుపేద గిరిజన విద్యార్థికి రూ. 60 వేలు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా సాయం చేశారు. శనివారం ఉట్నూర్‌లో రాయి సెంటర్ సార్‌మేడి మెస్రం దుర్గు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్ సమక్షంలో బాధిత విద్యార్థికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పెందుర్ దీపక్, తొడసం నాగోరావు, మెస్రం రూప్‌దేవ్, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వడంలో విఫలం

ఎదులాపురం: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయని భారతీయ మజ్దూర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలాల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధీర్‌కుమార్, క్రిష్ణ, కొండల్ రెడ్డి, నరేందర్, సుధాకర్ పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మంగారి జీవిత చరిత్ర పఠనం

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో నాగుల చవితి రోజున వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర పఠనాన్ని ప్రారంభించారు. ఆదివారంతో పఠనం కార్యక్రమం ముగిసింది. గ్రామంలో బ్రహ్మంగారి ఆలయం వద్ద గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆయన జీవిత చరిత్రను పూజారి బ్రహ్మయ్య భక్తులకు నెల రోజుల పాటు వివరించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పడం సంతోషంగా ఉందన్నారు.

కొలువుదీరిన గణనాథులు

జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. శనివారం అందంగా ముస్తాబు చేసిన మండపాల్లో వివిధ రూపాల్లో గణనాథులు కొలువుదీరాయి. ప్రజలు ఉండ్రాళ్లు, లడ్డూలు, పూలు పండ్లను నైవేద్యాలుగా సమర్పించారు. అనంతరం సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు. గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా మండలాల్లో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. - సాక్షి, నెట్‌వర్క్



ఆసిఫాబాద్ రూరల్: మొక్కుతున్న చిన్నారులు



దహెగాంలో..



రెబ్బెన: మట్టి విగ్రహాన్ని తీసుకువస్తున్న చిన్నారి



ఆసిఫాబాద్: కేశవనాథ ఆలయంలో..



మట్టి గణపతులు పంపిణీ చేస్తున్న నాయకులు



పూజలు చేస్తున్న భక్తుడు



కౌటాల: విగ్రహాలను పంపిణీ చేస్తున్న సభ్యులు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు



దహెగాం: ఐనంలో కొలువు దీరిన గణనాథుడు




ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లో..



మార్కెట్‌లో కొలువుదీరిన గణపతి



రెబ్బెన: బొజ్జ గణపయ్యను దర్శించుకుంటున్న యువకులు



బెజ్జూర్: కొలువుదీరిన వినాయకుడు

ఫారెస్ట్ అసోసియేషన్ కార్యవర్గం



ఎన్నికైన అధికారులు

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ డివిజన్ జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆసిఫాబాద్ డిప్యూటీ రేంజ్ అధికారి యోగేశ్ కులకర్ణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ఆరు పోస్టులకు నాలుగు ఏకగ్రీవం కాగా, రెండు పోస్టులకు ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సాయిచరణ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సద్దాం హుస్సేన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శి పోస్టుకు ఇద్దరు, ట్రెజరీ పోస్టుకు ఇద్దరు పోటీ పడగా ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో 74 మంది అటవీశాఖ అధికారులు పాల్గొనగా సంయుక్త కార్యదర్శిగా స్వప్న, కోశాధికారిగా బుక్యా రవి గెలుపొందారు. ఎన్నికల అధికారులుగా మంచిర్యాల అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ అజహర్, కాగజ్‌నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు మనవర్ వ్యవహరించారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని అటవీశాఖ అధికారులు సన్మానించారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఇంద్రవెల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఉదయం మండలంలోని దొడంద, గట్టెపల్లి, దుబ్బగూడ, కేస్లాపూర్, కేస్లాగూడ, గిన్నేర గ్రామాల్లో పర్యటించారు. గణేశ్ మండపం, జగదాంబ, సేవాలాల్ మహారాజ్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రైతులతో మాట్లాడి భారీ వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులను పరిశీలించారు. శంకర్‌గూడ ప్రధాన రహదారి నుంచి గ్రామం వరకు బీటీరోడ్డు మంజూరుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ముఖడే ఉత్తం, ఎండీ మసుద్, జహీర్, పవార్ దుదిరాం, కుమ్ర డొంగు రావ్, మోహన్‌రావ్, ఆత్రం గోవింద్ పాల్గొన్నారు.

సాంకేతిక లోపం కారణంగా రుణమాఫీ కాలేదు

ఉట్నూర్‌రూరల్: సాంకేతిక లోపం వల్ల కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్(బి), గండిగూడ గ్రామాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ముందుగా గ్రామంలో కొలువుదీరిన గణనాథుడికి పూజలు చేశారు.

మట్టి వినాయకుడినే పూజించాలి

బెజ్జూర్: ప్రతిఒక్కరూ మట్టి వినాయకుడినే పూజించాలని బెజ్జూర్ పద్మశాలి సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సామల తిరుపతి, కనుకుట్ల వెంకటేశ్‌లు అన్నారు. వినాయక చవితి సందర్భంగా శనివారం సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలుష్య నివారణలో భాగంగా గత కొన్నేళ్లుగా మండల ప్రజలకు ప్రతియేటా ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు మట్టి వినాయక విగ్రహాలకు పూజలు చేసి కాలుష్య నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సామల రవికాంత్, కనుకుట్ల శ్రీనివాస్, పర్ష రమేశ్, జోగ్రీగల శ్రీనివాస్, పడాల సదాశివ్, బొద్దున విజయ్, డి.అనిల్, కృష్ణ పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న నాయకులు

గుంతల రోడ్డే దిక్కు..!

- అధ్వానంగా కౌటాల- తుమ్మిడిహెట్టి రోడ్డు
- వాహనదారులు, ప్రజలకు తప్పని ఇక్కట్లు
- మరమ్మతులు చేపట్టని అధికారులు



బురదమయంగా రోడ్డు

కౌటాల: కౌటాల మండల కేంద్రం నుంచి మొగడ్‌దగడ్, తాటిపల్లి, తాటినగర్, బాలేపల్లి, వీర్దండి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి గ్రామ పంచాయతీలతో పాటు పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన తారురోడ్డు పూర్తిగా చెడిపోయి, రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు నరక యాతన పడుతున్నారు. భారీ వర్షాల కారణంగా నాలుగేళ్ల క్రితం రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో బస్సులు, ఆటోల ద్వారా ప్రయాణించే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పొంచిఉన్న ప్రమాదం..

మండల కేంద్రం నుంచి తుమ్మిడిహెట్టి గ్రామాలకు వెళ్లే రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కౌటాల నుంచి మొగడ్‌దగడ్, బాలేపల్లి గ్రామాల సమీపంలోని రోడ్డుపై అధికంగా గుంతలు పడి పూర్తిగా చెడిపోయింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో గ్రామాలకు అంబులెన్సులు వెళ్లి రావడం చాలా కష్టంగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌటాల మండల కేంద్రం నుంచి మొగడ్‌దగడ్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై కల్వర్టు వద్ద రోడ్డుపై గుంత ఏర్పడింది. కల్వర్టు సైతం కోతకు గురైంది. దీంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. కల్వర్టు కోతకు గురై నెలలు గడుస్తున్నా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

పట్టించుకోని పాలకులు

ప్రతీరోజు వందల వాహనాలు వెళ్లే రహదారి గుంతలమయంగా మారి ఏడాది గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మార్గం బాగునప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిసినప్పటికీ రోడ్డును బాగు చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండల కేంద్రం నుంచి తుమ్మిడిహెట్టి, ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన తారురోడ్లకు, కోతకు గురైన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి

కౌటాల మండల కేంద్రం నుంచి మొగడ్‌దగడ్, వీర్దండి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డుపై అడుగడుగునా గుంతలు పడ్డాయి. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణం చేయడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. కల్వర్టు కోతకు గురి కావడంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలి.

– విజయ్, గుండాయిపేట

మరమ్మతులు చేయడం లేదు

భారీ వర్షాల కారణంగా నాలుగేళ్లుగా కౌటాల –తుమ్మిడిహెట్టి రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుపై వెళ్లేటప్పుడు వాహనాలు చెడిపోవడంతో పాటు నడుమునొప్పులు వస్తున్నాయి. రెండేళ్ల నుంచి రోడ్డు అధ్వానంగా ఉన్న విషయం పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రోడ్డు గురించి పట్టించుకోవడం లేదు. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించాలి.

– ప్రశాంత్, వీర్దండి

అన్నదాతకు భారం..

- పెరుగుతున్న పెట్టుబడి.. తగ్గుతున్న దిగుబడి
- మద్దతు ధర పెంచాలని వేడుకోలు

కౌటాల: అన్నదాతకు పెరుగుతున్న ధరలతో సాగు భారంగా మారుతోంది. విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు రోజురోజుకూ పెరుగుతుండడంతో రైతులపై మోయలేని ఆర్థిక భారం పడుతోంది. ఈఏడాది విత్తనాల నుంచి కూలీల వరకు అన్ని రకాల ధరలు పెరిగాయి. పెట్టుబడులకు అనుగుణంగా పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దీంతో వ్యవసాయం సాగుకు రైతులు తిప్పలు పడుతున్నారు. పత్తి విత్తనం నాటే దగ్గర నుంచి పత్తి తీత వరకు పెట్టుబడులు గతంలో పోలిస్తే మూడు రేట్లు పెరిగాయి.

వ్యవసాయం భారం..

వరి సాగు ఎకరానికి రూ. 30 వేల నుంచి రూ. 35 వేలు ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నారు పోయడం, నాట్లు వేయడం, కలుపుతీయడం వరకు రూ. 6 వేలు ఖర్చు కాగా.. విత్తనాలకు రూ. 1100, కోతకు ఒకరికి రూ. 350, ఎరువులకు రూ. 4 వేలు, పురుగు మందుల కూలీలకు రూ. 1500 ఇలా తెగుళ్లు సోకే కొద్దీ పెట్టుబడి ఏటా పెరుగుతూ పోతుంది. తెల్లబంగారంగా అభివర్ణించే పత్తి పంటకు మిగతా పంటలతో పోల్చితే ఉత్పత్తి ఖర్చు ఎక్కువే. ఎకరానికి రూ. 35 వేల నుంచి రూ. 40 వేల దాకా పెట్టుబడి అవుతోంది. ఈసారి ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా దాదాపు 3.40లక్షలకు పైగా ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేస్తున్నారు. అలాగే వరి సైతం జిల్లాలో 60 వేల ఎకరాల్లో సాగు చేయనున్నారు.

దక్కని మద్దతు ధర..

పత్తి రైతులను మూడేళ్లుగా అధిక వర్షాలు వెంటాడుతున్నాయి. దీంతో పంటకు వేరు కుళ్లు తెగుళ్లు సోకి ఎదుగుదల తగ్గుతుంది. అలాగే పత్తి చేనుల్లో పెరిగిన గడ్డిని తొలగించడానికి, తెగుళ్ల నివారణకు విచ్చలవిడిగా క్రిమిసంహారక మందుల వాడేందుకు వెచ్చించే వ్యయం రెండింతలు పెరిగింది. భారీ వర్షాల కారణంగా పంట దిగుబడులు సైతం ఏటా తగ్గుతుంది. పత్తి దిగుబడి విషయానికి వస్తే రేగడి భూముల్లో నీళ్ల పెడితే ఎకరానికి 12 నుంచి 15 క్వింటాళ్లు, వర్షాధారంగా అయితే 8 నుంచి 10 క్వింటాళ్లు వస్తుంది. చెలక భూముల్లో నీళ్ల వసతి ఉంటే 6– 8 క్వింటాళ్లు, వర్షాధారంగా అయితే 5– 6 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.



వరి పంటలో కలుపు తీస్తున్న కూలీలు (ఫైల్)

పెట్టుబడి పెరిగింది



వార్ధా నది సరిహద్దులో మూడు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. ఇటీవల వరదలకు పత్తి దెబ్బతింది. దీంతో పత్తి దిగుబడి ఆశలు లేనట్లే. ఏటేటా పంటల సాగుకు పెట్టుబడి పెరుగుతుంది. పెరిగిన ధరలతో పంటలు సాగు చేయడం కష్టంగా మారింది.

– జాడే గణపతి, వీర్దండి, కౌటాల

మద్దతు ధర పెంచాలి



ఎడతెరిపి లేని వర్షాల కారణంగా పత్తిలో విపరీతంగా గడ్డి పెరిగింది. పత్తి పంట అరకతో దున్నిందుకు రూ. 1500 కూలీ చెల్లించాలంటున్నారు. కూలీల రెట్లతో పాటు మందులు, ఎరువుల రెట్లు పెరిగాయి. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. అన్ని పంటలకు మద్దతు ధర పెంచాలి.

– ప్రేంకుమార్, యాపలగూడ, కౌటాల

పుస్తక పఠనంతో విజ్ఞానం



పుస్తకాలను చదివిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

రెబ్బెన: పుస్తక పఠనంతో పిల్లల్లో విజ్ఞానం పెరుగుతుందని గోలేటి ఐటీడీఏ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్ అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ఆదివారం గోలేటి ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలలో రూం టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన సంచార గ్రంథాలయం ద్వారా పిల్లల చేత పుస్తకాలు చదివించారు. కథల పుస్తకాల ద్వారా పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడటానికి, విజ్ఞానం పెంచుకోవడానికి దోహదపడుతుందన్నారు. మొబైల్ లైబ్రరీలో గొండి, కొలామీ, ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు భాషలతో కథల పుస్తకాలు ఉన్నాయని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ సత్యనారాయణ, పాఠశాల అధ్యాపకులు, రూం టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ శ్రీనివాస చారి పాల్గొన్నారు.

ఆలయంలో మోటార్ చోరీ

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి ఓంకార ఆశ్రమ ఆలయ మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి దొంగతనం చేశారు. ఆశ్రమ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆశ్రమంలోని రాధాక్రిష్ణ ఆలయం, ఇతర అవసరాలకు సమీపంలోని బావిలో విద్యుత్ మోటార్ ఏర్పాటు చేసుకున్నారు. కాగా ఆదివారం ఉదయం నిర్వాహకులు గమనించి మోటార్ దొంగతనానికి గురైనట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఆంగ్లం– 2, హిస్టరీ– 1, ఎకనామిక్స్– 1, పొలిటికల్ సైన్స్–1, కంప్యూటర్ సైన్స్– 1, బోటని–1, జువాలజీ–1 ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 11వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు సంబంధిత విభాగంలో పీజీలో 55 శాతం మార్కులు కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని సూచించారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.